




# కరపత్రం

SINCE 2014

మంగళవారం జూన్ 09, 2026 సంపుటి : 2 సంచిక : 238 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


### రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..

# గుజరాత్‌కు గులాంగిరి

- మెట్రో, మూసీ ప్రక్షాళనకు ఎందుకు అడ్డుకుంటున్నారు
- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిలపై మండిపడ్డ సిఎం రేవంత్



**హైదరాబాద్,జూన్8 :**
రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..గుజరాత్‌కు ఇంకెన్నాళ్లు గులాంగరి చేస్తారని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రోకి కేంద్రం నుంచి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ నిధులు ఎందుకు తీసుకురారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. హైదరాబాద్‌కి సింగూరు జలాలను ఎందుకు తీసుకురానివ్వరని ప్రశ్నల వర్షం కురిపించారు. గోదావరి జలాలు తీసుకొస్తే వారికేం ఇబ్బందని నిలదీశారు. గుజరాత్‌కు ఎన్నాళ్లు గులాంలుగా ఉంటారని ధ్వజమెత్తారు. సోమవారం హైదరాబాద్ మియాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ప్రభుత్వానికి అండగా ఉంటామని మహిళలు చెబుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్యాన్ని నియంత్రించకపోవడం వల్లే ఢిల్లీని పడావ్ పెట్టారని విమర్శించారు. ముంబైలో ట్రాఫిక్ జామ్, వర్షం వస్తే రోడ్లపైకే నీళ్లు వస్తాయని తెలిపారు. స్లమ్స్‌లో సదుపాయాలు లేక ముంబైలో నివసించే పరిస్థితి లేదని చెప్పారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్యతో హైదరాబాద్‌కు కంపెనీలు వచ్చాయని ప్రస్తావించారు. ఎయిర్‌పోర్టుకు ఎన్నిగంటల్లో చేరుకుంటామో కూడా చెప్పలేమని అన్నారు. గతేడాది వారంపాటు నీళ్లలోనే చెన్నై ఉందని వివరించారు. కోల్‌కతా శాంతిభద్రతల గురించి చెప్పాల్సిన అవసరమే లేదని తెలిపారు. ఐదు నగరాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. ఒక్కటే నగరంగా ఉంటే అనేక సమస్యలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. పరిపాలనలో సమస్యలు తలెత్తకుండా 3 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. అమెరికా సిలికాన్ వ్యాలీతో మన సైబరాబాద్ పోటీపడుతోందని ఉద్ఘాటించారు. గ్రేటర్ చుట్టూ నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తెలంగాణలో 8 మంది ఎంపీలను ప్రజలు గెలిపించారని తెలిపారు. మెట్రో, మూసీ ప్రక్షాళనకు అనుమతులు ఎందుకు తేవట్లేదని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి ఎంత లడాయి మనిషి అనేది అందరికీ తెలుసునని విమర్శించారు. కిషన్‌రెడ్డి డ్రామాలు ఆపాలని ఎద్దేవా చేశారు.



### సంక్షేమ రాజ్య నిర్మాణం..

# ప్రజాప్రభుత్వ లక్ష్యం

- తెలంగాణలో 'నాలెడ్జ్' విప్లవం
- రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్
- రూ..25 కోట్లతో ఎస్సీ హాస్టల్ పునరుద్ధరణ
- ఉద్యోగాల నోటిఫికేషన్లతో పాటు ఉచిత డిజిటల్ కోచింగ్
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి



**హైదరాబాద్,జూన్8 :**
ప్రజా ప్రభుత్వం తెలంగాణలో సంక్షేమ రాజ్యం నిర్మించేదిశగా కృత నిశ్చయంతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు. లోయర్ ట్యాంక్ బండ వద్ద రూ.110 కోట్ల అంచనాలతో నిర్మించనున్న బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్, నింబోలి అడ్డా వద్ద రూ. 25 కోట్ల అంచనాలతో నిర్మించనున్న ఎస్సీ హాస్టల్ కు సబంధించి స్థల పరిశీలన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ రెండు భవనాలకు సంబంధించి ఆర్థిక, పాలనపారమైన అనుమతులు మంజూరయ్యాయని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ భవనాలు కేవలం భౌతికంగా కనపడేటువంటి ఒక కట్టడాలు మాత్రమే కాదు.. వేలాదిమంది విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడే ఆధునిక దేవాలయాలని ఆయన అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకుల కోచింగ్ కష్టాలను శాశ్వతంగా దూరం చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ బలమైన సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించ తలపెట్టిన 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్' స్థలాన్ని, ఆ తర్వాత కాచిగూడలోని 'నింబోలిఅడ్డా హాస్టల్' ప్రాంగణాన్ని సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఉప ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

మిగతాద్ది 2 లో



## టూరిజంకు కొత్త రూట్ మ్యాప్ సిద్ధం

- తొలి దశలో 8 ప్రత్యేక పర్యాటక ప్రాంతాల అభివృద్ధి
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూప్లలి కృష్ణారావు

2లో..

**హైదరాబాద్,జూన్8**
తెలంగాణ టూరిజంకు కొత్త రూట్ మ్యాప్ సిద్ధం చేశామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూప్లలి కృష్ణారావు వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లో పర్యాటక శాఖ ఉన్నతాధి కారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహించారు.



## వెటర్నరీ ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రి తుమ్మల

**ఖమ్మం,జూన్8 :**
జిల్లాలోని వి. వెంకటాయపాలెంలో వెటర్నరీ ఆసుపత్రిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వెంకటాయపాలెం గ్రామానికి జిల్లాలో ఓ చరిత్ర ఉందన్నారు.

2 లో

### బొగ్గు దిగుమతలును తగ్గించేయత్నం

### బొగ్గు ఉత్పత్తిలో స్వయం

# సమృద్ధి దిశగా భారత్

- » మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- » ప్రస్తుతం 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు
- » గత 12 ఏళ్లుగా ప్రధాని మోడీ నిరంతర కృషితో పురోగతి
- » కోల్ రంగంలో సంస్కరణలతో ఐదులక్షల మందికి ఉపాధి
- » క్రిటికల్ మినరల్స్ కోసం అర్జెంటీనాతో ఒప్పందం
- » కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,జూన్8 :**
క్రమంగా విదేశాల నుంచి బొగ్గు దిగుమతులను తగ్గించే పనిలో ఉన్నామని కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నూతన భారత నిర్మాణంలో బొగ్గు రంగం కీలక పాత్ర పోషిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రతి వారం బొగ్గు ఉత్పత్తి, సరఫరాపై ప్రధాని మోదీ పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. గతంలో రూ.1.89లక్షల కోట్ల బొగ్గు కుంభకోణం జరిగిందని కాగ్ నివేదిక ఇచ్చింది. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన కోల్ మైన్స్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక బొగ్గు రంగంలో కీలక సంస్కరణలు తీసుకొచ్చాం అన్నారు. ప్రస్తుతం 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. గతంలో బొగ్గును చైనా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకునేవాళ్లం. అయితే ఇప్పుడు ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం అని వివరించారు. అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం చేస్తున్నాం. ఈనెల 11న ప్రైవేట్ కంపెనీలతో చర్చిస్తాం. 2028 నాటికి అన్ని కోల్ బ్లాక్స్ మూసేస్తాం. క్రిటికల్ మినరల్స్ మిషన్ ప్రయోగానికి రూ.1,500 కోట్లు కేటాయించాం. 24 క్రిటికల్ మినరల్స్‌ను దిగుమతి చేసుకుంటున్నాం. అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్స్ బ్లాక్స్ తీసుకున్నాం అని కిషన్‌రెడ్డి అన్నారు.

మిగతాది 2లో



2లో..

# మోడీ పాలనతో చిక్కుల్లో దేశం

- సర్ ప్రక్రియతో లక్షలాది మంది ఓట్లు గల్లంతు
- రాజకీయ వేధింపులకు దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- ఇండియాకూటమి భేటీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

**న్యూఢిల్లీ,జూన్8 :**
ప్రధాని నరేంద్ర మోదీ పాలనతో భారతదేశం సమస్యల్లో పడిందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. మోదీ హయాంలో రాజ్యాంగంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని.. బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని మండిపడ్డారు.



## రాష్ట్రంలో పాఠశాలలను కుదించే కుట్ర

సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కవిత

**హైదరాబాద్,జూన్8 :**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన సమీకృత పాఠశాలలు నిర్ణయంపై టిఆర్ఎస్ చీఫ్ కె.కవిత మండిపడ్డారు.



## మహిళా సాధికారతలో మరో కీలక మలుపు

- మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు
- సిఎం రేవంత్ సమక్షంలో నేడు అందచేత

**హైదరాబాద్,జూన్8 :**
మహిళా సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు కేటాయించనుంది.

### యూరియా యాప్‌తో

# రైతులకు మేలు

- అన్ని రాష్ట్రాల్లో అమలుకు ఆసక్తి
- ప్రశంసలు అందించిన కేంద్ర వ్యవసాయ శాఖ
- మంత్రి తుమ్మల కార్యాలయం ప్రకటన



2 లో

**హైదరాబాద్,జూన్8**
రైతులకు పారదర్శకంగా ఎరువుల పంపిణీ చేయడం ద్వారా తెలంగాణ ఫర్టిలైజర్ యాప్‌నకు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రాష్ట్ర ఫర్టిలైజర్ యాప్‌ను పొరుగు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ నమూనాపై ప్రత్యేక యాప్‌ల రూపకల్పనకు ఇతర రాష్ట్రాలు చర్యలు చేపట్టాయని ఆయన వివరించారు. తెలంగాణ ఫర్టిలైజర్ యాప్.. కేంద్ర వ్యవసాయ శాఖ ప్రశంసలు కూడా పొందిందని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ఫెర్టిలైజర్ ఎరువుల యాప్ అమలుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందని వివరించారు.

### నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో

# చేపమందు పంపిణీ

- ఏర్పాట్లను పరిశీలించిన సిపి సజ్జన్నార్
- పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు
- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్



2లో..

**హైదరాబాద్,జూన్8 :**
చేప మందు పంపిణీ సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భద్రతా ఏర్పాట్లను హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లు, కౌంటర్లు, మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్ పని తీరును పరిశీలించారు. సీపీతో పాటు జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, గోల్కొండ డీసీపీ చంద్ర మోహన్ ఏర్పాట్లను పరిశీలించారు. ఇప్పటికే నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేప మందు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. దీంతో నాంపల్లి మెట్రో పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు నెమ్మదిగా కదులుతున్న పరిస్థితి. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భక్తుల కోసం చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా వైద్య, అగ్నిమాపక శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. చేప ప్రసాదం కోసం వచ్చిన వారి కోసం 3 హెల్త్ క్యాంప్‌లను అందుబాటులో ఉంచారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం జూన్ 09, 2026

## నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో
# చేపమందు పంపిణీ

మొదటిపేజీ తరువాయి

అత్యవసర పరిస్థితుల కోసం 5 అంబులెన్సులను సిద్ధం చేశారు. అస్వస్థతకు గురైన వారికి అక్కడికక్కడే ప్రాథమిక చికిత్స అందించనున్నారు. అవసరమైతే ఉస్మానియా ఆస్పత్రికి తరలింపుకు ఏర్పాట్లు చేశారు. వైద్య సిబ్బందితో హెల్త్ టీమ్ 24 గంటలూ అప్రమత్తంగా ఉండనుంది. భద్రతా చర్యల్లో భాగంగా 3 ÷ర్ ఇంజిన్లు అందుబాటులో ఉన్నాయి. భారీ జనసందోహం నేపథ్యంలో ప్రత్యేక అత్యవసర సేవలను ఏర్పాటు చేశారు. చేప ప్రసాదం కోసం వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలను అధికారులు కల్పించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం తరపున లక్షకు పైగా చేప పిల్లల ఏర్పాటు చేశారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఇప్పటికే దాదాపు 50 వేల మంది నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. సాయంత్రం 7 గంటల నుంచే క్యూలైన్లలో ఉండనున్నారు. రాత్రి 9 గంటల 1 నిమిషానికి చేపమందు పంపిణీ ప్రారంభంకానుంది. శుభ ముహూర్తం ప్రకారమే చేపమందు పంపిణీని నిర్వాహకులు ప్రారంభించనున్నారు. ఉబ్బసం, ఆస్తమా బాధితులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. భద్రత, వైద్య సదుపాయాలు, తాగునీటి ఏర్పాట్లతో అధికారులు సిద్ధమయ్యారు. చేపమందు పంపిణీ నేపథ్యంలో నాంపల్లి పరిసరాల్లో ప్రత్యేకంగా ట్రాఫిక్ నిబంధనలు విధించారు. చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేసినట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ రోజు రాత్రి 9 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం కానుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్ ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటికే దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 25 వేల మంది హైదరాబాద్‌కు చేరుకున్నారని వెల్లడించారు. చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెయ్యి మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు. భద్రతా చర్యలను గోల్కొండ డీసీపీ చంద్ర మోహన్ పర్యవేక్షిస్తారని చెప్పారు. అలాగే ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని వెల్లడించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఐదు అంబులెన్సులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వివిధ భాషల్లో సూచనలు, సమాచారాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో నివసించే వారు రద్దీని దృష్టిలో ఉంచుకుని వీలైతే మంగళవారం వచ్చి చేప ప్రసాదం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందరికీ సరిపడా చేప ప్రసాదం అందుబాటులో ఉందని, ఎలాంటి పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఎన్జీవో సంస్థల వద్ద కూడా పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షీ టీమ్స్, మఫ్టీ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. గతంలో జరిగిన కొన్ని ఆరోగ్య అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత కట్టుదిట్టమైన భద్రత, వైద్య సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో కార్యక్రమం జరుగనున్న నేపథ్యంలో భక్తులు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని సీపీ సజ్జనార్ కోరారు.

## వెటర్నరీ ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రి తుమ్మల

మొదటిపేజీ తరువాయి

ఎన్టీరామారావుతో ఈ గ్రామానికి వచ్చి ఇక్కడే భోజనం చేసినట్లు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఇక్కడ భూగర్భ జలాలు లేకపోతే లిఫ్ట్ పెట్టమని అడిగితే, ఎన్టీ రామారావు ప్రభుత్వంలో లిఫ్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం పెట్టాలని ప్రతిపాదన వచ్చినప్పుడు ఒక్కొక్కరూ ఒక్కోచోట పెట్టాలని కోరితే... వి.వెంకటాయపాలెంలో పెట్టినట్లు చెప్పారు. ప్రతి పని పదికాలాల పాటు ఉండేలా చేయించాలని మంత్రి అన్నారు. వెంకటాయపాలెం గ్రామాన్ని తన శక్తి మేరకు అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. 'మనకు పని చేసే మంచి ఆర్డీవో వచ్చారు.. ఆయనతో భూమి సర్వే చేయించుకోండి' అని అన్నారు. ఇళ్ల స్థలాలు నిజమైన పేద వాళ్లకి ఎన్ని ఉంటే అన్ని ఇచ్చేయాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

## మోడీ పాలనతో చిక్కుల్లో దేశం

మొదటిపేజీ తరువాయి

కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ వేధింపులకు వాడుకుంటున్నారని ఆరోపించారు. సోమవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా బ్లాక్ కూటమి పార్టీల నేతలు సమావేశమయ్యారు. మోదీ ప్రభుత్వంలో దేశం ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీలను ఉద్దేశించి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. దేశ ఆర్థిక పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని ఆయన అన్నారు. ఉద్యోగాల కల్పనకు అవసరమైన పెట్టుబడులు దేశానికి రావడం లేదని పేర్కొన్నారు. పలు రంగాల్లో ప్రైవేట్ గుత్తాధిపత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తో లక్షలాది మంది ప్రజలు ఓటు హక్కును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎస్ఎమ్ఈ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. మోదీ ప్రభుత్వంలో పరీక్షల నిర్వహణ వైఫల్యాలతో యువత నష్టపోతున్నారని ఖర్గే చెప్పుకొచ్చారు. మూడేళ్ల క్రితం ఇండియా కూటమి ఏర్పడిందని, పార్లమెంటులో ఇటీవల దాని బలం ఏంటో అధికార పక్షం రుచి చూసిందన్నారు. లోక్‌సభలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లును ఓడించేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 17న కూటమి పార్టీలు దృఢంగా ఏకమయ్యాయని ఖర్గే ప్రశంసించారు. ఇప్పుడు ఆ స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకుని ముందుకు సాగాలన్నారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిపక్షం ఐక్యంగా ఉండాలన్నారు. కీలక సమావేశానికి 23 ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. వారిలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ, దీపాంకర్ భట్టాచార్య, మెహబూబా ముఫ్తీ, సుప్రియా సూలే, బ్రివన్ థోల్ తదితరులు ఉన్నారు. అయితే, కీలక భాగస్వాములైన డీఎంకే, ఆప్ పార్టీలు మాత్రం సమావేశానికి దూరంగా ఉన్నాయి.

## బొగ్గు దిగుమతలును తగ్గించేయత్నం

మొదటిపేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా దేశ అభివృద్ధి కోసం అనేక కీలక సంస్కరణలు అమలు చేసిందని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని ఆయన పేర్కొన్నారు. గతంలో బొగ్గు రంగం అవినీతి, అక్రమాలు, అరకొర నిధులతో ఇబ్బందులు ఎదుర్కొనేదని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ రంగం పూర్తిగా రూపాంతరం చెందిందన్నారు. కోల్ రంగంలో సంస్కరణల ఫలితంగా దేశవ్యాప్తంగా సుమారు ఐదులక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని కిషన్ రెడ్డి వెల్లడించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో బొగ్గు కేటాయింపుల వ్యవహారంలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయని.. అప్పటి కేంద్ర బొగ్గు మంత్రి జైలుకు వెళ్లిన పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. ప్రస్తుతం కోల్ రంగం పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేస్తోందని అన్నారు. ప్రపంచంలో బొగ్గు వినియోగంలో చైనా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉందని, దేశ విద్యుత్ ఉత్పత్తిలో 72శాతం బొగ్గుపైనే ఆధారపడి ఉందని మంత్రి వివరించారు. ఈ ఏడాది దేశం ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మైలురాయిని చేరుకుందని తెలిపారు. ప్రస్తుతం దేశ అవసరాలకు సరిపడేలా 80 రోజుల బొగ్గు నిల్వలు అందుబాటులో ఉన్నాయని, విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం కలగకుండా కోల్ సంస్థలు పనిచేస్తున్నాయని చెప్పారు. స్టీల్, ఎరువుల పరిశ్రమలతో పాటు అనేక రంగాలకు బొగ్గు కీలక ముడి పదార్థమని పేర్కొన్న కిషన్ రెడ్డి, గతంలో విదేశాల నుంచి భారీగా బొగ్గు దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు దేశీయ ఉత్పత్తి పెరగడంతో దిగుమతులు గణనీయంగా తగ్గాయని తెలిపారు. మైనింగ్ ప్రాంతాల్లో రైల్వే మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూ రవాణా ఖర్చులు తగ్గించే చర్యలు చేపడుతు న్నామని చెప్పారు. క్రిటికల్ మినరల్స్ విషయంలో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పోటీ నెలకొందని, వాటి కోసం దేశాధినేతలను కూడా కిడ్నాప్ చేసే స్థాయికి పరిస్థితులు వెళ్లాయని ఆయన వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్‌కు ఒక పొరుగు దేశం కీలక ఖనిజాల సరఫరాను నిలిపివేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో క్రిటికల్ మినరల్స్‌లో స్వయం సమృద్ధి సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తోందన్నారు. ప్రధాని మోదీ విదేశీ పర్యటనల్లో కూడా కీలక ఖనిజాల సరఫరాపై వివిధ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని చెప్పారు. కోల్ ఆధారంగా సింథటిక్ గ్యాస్ తయారీపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. అంతర్జాతీయంగా ఇరాన్, అమెరికా ఉద్రిక్తతల వంటి పరిస్థితుల వల్ల ఇంధన దిగుమతులపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ వనరుల అభివృద్ధి అవసరమని అన్నారు. దేశంలో 187 బొగ్గు గనులు ఉన్నాయని, వినియోగం పూర్తయిన గనులను శాస్త్రీయ పద్ధతుల్లో మూసివేస్తున్నామని మంత్రి తెలిపారు. మూసివేసిన గనుల్లో పెద్ద ఎత్తున వృక్షారోపణ, పర్యాటక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ గనులను ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని, గిన్నిస్ బుక్ రికార్డుకు కూడా ప్రయత్నిస్తు న్నామని వెల్లడించారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ నిధుల విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. గనుల ప్రభావిత గ్రామాల అభివృద్ధికి 2శాతం నిధులు కేటాయించాలని చట్టం చేసినప్పటికీ, ఆ నిధులను జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదని ఆరోపించారు. కలెక్టర్లను అడిగితే కూడా రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదనే సమాధానం వస్తోందని చెప్పారు. సింగరేణి కాలరీస్ వ్యవహారాలు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయని పేర్కొన్న ఆయన, గతంలో డీఎంఎఫ్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు. సింగరేణి ఆర్థిక భారం తగ్గించేందుకు చర్యలు తీసుకున్నామని, ఉద్యోగుల కోసం బీమా సదుపాయాలు కూడా తీసుకొచ్చామని తెలిపారు. సింగరేణి ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గత 12 ఏళ్లలో మోదీ తన పాలనలో ప్రత్యేకమైన ముద్ర వేసారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ అభివృద్ధితో పాటు సామాజిక సంక్షేమానికి కూడా కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. అవినీతికి కాంగ్రెస్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఆరోపించారు.

## రాష్ట్రంలో పాఠశాలలను కుదించే కుట్ర

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలోని 27,000 పాఠశాలలను 4,000కు కుదించనున్నట్లు సిఎం ప్రకటించడం తీవ్ర అభ్యంతరకరమని సోమవారం విడుదల చేసిన ఒక వీడియో ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. పేద విద్యార్థులను, ముఖ్యంగా బాలికలను విద్యకు దూరం చేసేలా ఉన్న ఈ నిర్ణయం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు మరణించినా సిఎం కనీసం సమీక్ష కూడా నిర్వహించలేదని మండిపడ్డారు. ఇప్పుడు పాఠశాలలు మూసివేస్తున్నామని ప్రకటించారని, విద్యాశాఖపై ప్రభుత్వానికి కనీస పట్టు లేదని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోందని అన్నారు. బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని 27,000 ప్రభుత్వ పాఠశాలల్లో 18 లక్షల మంది విద్యార్థులుండగా, 12,000 ప్రైవేట్ స్కూళ్లలో 35 లక్షల మంది చదువుతున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకేచోట విద్య, ఉచిత రవాణా, భోజన వసతులతో కూడిన 'సమీకృత పాఠశాలలను' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## యూరియా యాప్‌తో
# రైతులకు మేలు

మొదటిపేజీ తరువాయి

రెండు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఫెర్టిలైజర్ ప్ అమలు చేస్తామన్నారు. యాప్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. దీంతో ఎరువులను మీ సేవా కేంద్రాల ద్వారా బుకింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. టెలిఫోన్ ద్వారా కూడా ఎరువుల బుకింగ్ సదుపాయం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఫెర్టిలైజర్ తుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని మంత్రి తుమ్మల తెలిపారు. డీలర్ల వద్ద స్టాక్ వివరాలు మొబైల్‌లోనే తెలుసుకునే విధంగా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. దీంతో ఎరువుల కోసం క్యూ లైన్‌లకు చెక్ పెడుతూ.. రైతులకు సమయానుకూల సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీలో అక్రమాలకు ఈ ఫర్టిలైజర్ యాప్ అడ్డుకట్ట వేసిందన్నారు. ఖరీఫ్ అవసరాల కోసం 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరిందని చెప్పారు. మిగిలిన యూరియా సరఫరా కోసం కేంద్రంతో నిరంతరాయంగా సమన్వయం చేసుకుంటున్నామన్నారు. అందుకోసం ఢిల్లీలో ప్రత్యేక నోడల్ అధికారిని ప్రభుత్వం నియమించిందని పేర్కొన్నారు. నౌకాశ్రయాల్లోని పోర్టుల నుంచి యూరియా వేగంగా తరలింపునకు ప్రత్యేక అధికారిని కూడా ఏర్పాటు చేశామన్నారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రతి దశను ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని మంత్రి తుమ్మల వివరించారు. రైతు సంక్షేమ కార్యక్రమాలపై రాజకీయాలు చేయవద్దంటూ ప్రతిపక్షాలకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల హితవు పలికారు. రైతులకు మెరుగైన సేవల కోసం సాంకేతిక వినియోగాన్ని విస్తరిస్తామన్నారు. ఈ మేరకు ఆదివారం తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్యాలయం ప్రెస్ నోట్ విడుదల చేసింది.

## సంక్షేమ రాజ్య నిర్మాణం.. ప్రజాప్రభుత్వ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ను ట్యాంక్‌బండ్ దగ్గర సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, మరో 10 అంతస్తులతో నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అవతేకాక నింబోలిఅడ్డా వద్ద మూడు అంతస్తులతో హాస్టల్ భవనాల నిర్మాణం దళిత, నిరుపేద వర్గాల చిరకాల వాంఛ అని చెప్పారు. ఈ భవనాలను నిర్మించడం ద్వారా రాష్ట్రంలో జ్ఞానం పొందాలనుకునే అందరికీ పెద్ద ఎత్తున ఉపయోగపడతాయని చెప్పారు. ఈ భవనాల నిర్మాణంకు సంబంధించి ప్రతిపాదనలు పంపిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరపున ÷నాన్స్ క్లియరెన్స్ చేసి పంపించడం జరిగిందన్నారు. నాలెడ్జ్ సెంటర్ లో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, కాన్ఫరెన్స్ హాల్స్ లో విజ్ఞానాన్ని పంచే అత్యుత్తమ వేదికలగా నిలుస్తాయనే అశాభవాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇక్కడ నిర్వహించే కార్యకలాపాలను డిజిటల్ వ్యవస్థతో మారుమూల ప్రాంతాలకు చేర్చేలా బలమైన సాంకేతిక వ్యవస్థను అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత మేము చాలా స్పష్టంగా చెప్పాము.. రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్స్ ను నిర్మిస్తున్నట్లు ప్రకటించామని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కోచింగ్ కోసం హైదరాబాద్ రాకుండా అక్కడే ప్రిపేరయ్యేలా ఇవి ఉండబోతున్నాయి. భవిష్యత్తులో ఆయా శాసనసభ నియోజకవర్గాల్లోనే, అక్కడే వాళ్లకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. బెస్ట్ ఆఫ్ ది బెస్ట్ లెక్చరర్స్ ఇక్కడి నుంచి పాఠాలు చెబుతుంటే.. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు ఉన్నచోటనుంచే కదలకుండా కోచింగ్‌ను పొందేలా ఈ సెంటర్లను ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు చెప్పారు. నాలెడ్జ్ సెంటర్ కేవలం ఒక భవనం మాత్రమే కాదని, కోట్లాది మంది విజ్ఞానాన్ని పెంపొందించుకునే ఒక నిరంతర విద్యా వేదికగా ఆయన అభివర్ణించారు. కూలీ నాలీ చేసుకునే తల్లిదండ్రులు, వ్యవసాయం చేసుకునే కుటుంబాలు, మధ్యతరగతి చిన్న వ్యాపారుల పిల్లలు.. పోటీ పరీక్షల కోచింగ్ కోసం హైదరాబాద్ వచ్చి ఇక్కడ వసతి ఖర్చుల భారాన్ని మోయలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ముందుచూపుతో ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కేవలం ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వడమే కాకుండా, నిరుద్యోగులు ఆయా ఉద్యోగాలను సాధించేలా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత కోచింగ్ సౌకర్యాన్ని ఈ నాలెడ్జ్ సెంటర్ ద్వారా అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఈ ప్రధాన సెంటర్ నుంచి బెస్ట్ లెక్చరర్స్ చెప్పే పాఠాలను.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో నిర్మించబోయే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో, డిజిటల్ వ్యవస్థ ద్వారా విద్యార్థులు నేరుగా వీక్షించేలా ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు వివరించారు. ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించే ఈ భవన సముదాయంలో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, అత్యాధునిక కాన్ఫరెన్స్ హాళ్లు ఉంటాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులతో ఇక్కడ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాత నిర్మాణాన్ని పూర్తిగా తొలగించడం కోసం రూ.5 కోట్ల నిధులను విడుదల చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం 2016లోనే దీనికి శంకుస్థాపన చేసినప్పటికీ వివిధ కారణాల వల్ల నిర్మించలేకపోయిందన్నారు. మా ప్రజాప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో ఈ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి సంకల్పించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్ మొత్తం వ్యయం రూ.110 కోట్లని, ఈ ఏడాదే పనులు వేగంగా జరగడానికి బ్జడెట్ లోనే రూ.50 కోట్లను కేటాయించినట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఎక్కడా రాజీ పడకుండా అత్యుత్తమ ఆర్కిటెక్చర్, బెస్ట్ డిజైన్స్‌తో ఈ భవనాన్ని నిర్మించాల్సిందిగా సంక్షేమ శాఖకు ఆయన సూచించారు. ఉమ్మడి రాష్ట్ర కాలం నుంచి ఎంతో మంది పేద విద్యార్థులకు ఆశ్రయమిచ్చి, ఉన్నత ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దిన కాచిగూడలోని 'నింబోలిఅడ్డా హాస్టల్' ను పూర్తిగా ఆధునికీకరణ చేయబోతున్నట్లు ఉపముఖ్యమంత్రి ప్రకటించారు. బ్జడెట్ సమావేశాల్లోనే ఈ ప్రతిపాదనను ప్రవేశపెట్టామని చెప్పారు. ఈ హాస్టల్‌కు 'బాబు జగ్జీవన్ రామ్ నాలెడ్జ సెంటర్' గా నామకరణం చేస్తున్నట్లుగా చెప్పారు. ఇక్కడ కూడా విజ్ఞానాన్ని వ్యాప్తి చేసేలా మరొక అద్భుతమైన నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధమై ముందుకు వెళ్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ పనులన్నింటినీ మరింత మెరుగ్గా ముందుకు తీసుకెళ్లడానికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ నాలెడ్జ్ సెంటర్ల నిర్మాణాలపై మేధావులు, కుల సంఘాల నాయకులు, విద్యార్థులు ఎవరైనా సరే తమ విలువైన సలహాలు, సూచనలను నిరభ్యంతరంగా సంక్షేమ శాఖా మంత్రికి ఇవ్వవచ్చని చెప్పారు. ఈ పర్యటనలో సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్ దీపక్ జాన్, ఇతర సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..గుజరాత్‌కు గులాంగిరి

మొదటిపేజీ తరువాయి

తెలంగాణతో మహారాష్ట్ర సీఎం చర్చలకు రాకుండా.. అడ్డుకుంటున్నది బీజేపీనేనని ఆగ్రహించారు. సబర్మతి అద్భుతమన్న బీజేపీ నేతలు.. మూసీ ప్రక్షాళన చేయరా అని ప్రశ్నించారు. పదేళ్ల తర్వాత ఒకాయన ఫామ్‌హౌస్‌కు వెళ్లారని విమర్శించారు. పదేళ్లపాటు కేసీఆర్, 12 ఏళ్లలో మోదీ ఏం చేశారో అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్, బీజేపీ నేతలు చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎకరం రూ.200 కోట్లు పలుకుతున్న ప్రాంతంలో మౌలిక వసతులు అవసరమని చెప్పుకొచ్చారు. కార్పొరేట్ ఆఫీస్‌ల మాదిరిగానే కార్పొరేషన్ ఆఫీస్ నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఎక్కడ నివసించేవారికి అక్కడే ఇళ్లు కట్టి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.1,674.74కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. మియాపూర్‌లో రూ.161కోట్లతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.530కోట్లతో మియాపూర్ చౌరస్తాలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అలాగే రూ.308కోట్లతో శేరిలింగంపల్లి ఆర్వోబీ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టారు. రూ.65.53కోట్లతో నిర్మించిన బాచుపల్లి ఫ్లైవర్‌కు సీఎం రేవంత్ ప్రారంభోత్సవం చేశారు. రూ.229 కోట్లతో ఓఆర్ఆర్‌కు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డు కోసం ప్రధాన వంతెన నిర్మాణం, ఓఆర్ఆర్ నుంచి కొత్త సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. రూ.110కోట్లతో శంకర్‌పల్లి రోడ్ నుంచి మణికొండ వరకు పైప్ లైన్ రోడ్డు నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. రూ.29.25కోట్లతో కొల్లూరు ఇంటర్‌చేంజ్ సమీపంలోని రెండు రైల్వే ఓవర్ హెడ్స్ వరకు నాలుగు లేన్ల అప్రోచ్ ర్యాంపుల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టారు. రూ.26.50కోట్లతో నానక్‌రామ్‌గూడ నుంచి గచ్చిబౌలి వరకు ఓఆర్ఆర్ ఎడమ వైపు ఉన్న ప్రధాన క్యారేజ్ వే విస్తరణకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికీ భూమిపూజ చేశారు. రూ.14.40కోట్లతో మాదాపూర్, నానక్‌రామ్‌గూడలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నిర్మాణానికి సీఎం రేవంత్ కొబ్బరికాయ కొట్టారు. అనంతరం మియాపూర్‌లో 'ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక' బహిరంగ సభలో ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సభకు మంత్రి శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, ఎమెల్యేలు అరికెపూడి గాంధీ, మాల్ రెడ్డి రంగారెడ్డి, నవీన్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## టూరిజంకు కొత్త రూట్ మ్యాప్ సిద్ధం

మొదటిపేజీ తరువాయి

అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తొలి దశలో 8 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. వాటిని ప్రపంచ స్థాయి పర్యాటక గమ్య స్థానాలుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి ప్రాంతానికి ప్రత్యేక మాస్టర్ ఎ÷-లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించామన్నారు. 'స్లో టూరిజం'కు ప్రాధాన్యం ఇవ్వాలని వారికి సూచించినట్లు తెలిపారు. ప్రకృతి, చరిత్ర, సంస్కృతి కలగలిపిన పర్యాటక అనుభూతిపై దృష్టి సారించామని వివరించారు. వికారాబాద్, రామప్ప దేవాలయం, యాదాద్రి, భద్రాచలం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి జూపల్లి తెలిపారు. భువనగిరిని దేశంలోనే అగ్రశ్రేణి హెరిటేజ్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దే యోచన చేస్తున్నామన్నారు. కేరళలో జటాయు తరహాలో ఐకానిక్ ప్రాజెక్టులపై అధ్యయనం చేస్తున్నట్లు వివరించారు. స్కైవాక్‌లు, వ్యూడెక్స్, అడ్వెంచర్ యాక్టివిటీలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. సోమశిలలో క్రూయిజ్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్‌కు భారీ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పర్యాటక రంగం ద్వారా ఉపాధి, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక మ్యాప్‌పై నిలపాలన్న లక్ష్యంతో ముందడుగు వేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కార్యాచరణను ప్రారంభించామని మంత్రి జూపల్లి కృష్ణారావు వివరించారు.

## మహిళా సాధికారతలో మరో కీలక మలుపు

మొదటిపేజీ తరువాయి

మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ బస్సులను మహిళా సంఘాలకు సీఎం రేవంత్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌తోపాటు ఆర్టీసీ ఉన్నతాధికారులతో సీఎస్ రామకృష్ణారావు సమీక్ష నిర్వహించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిట్టింగ్, తాగునీరు, మొబైల్ టాయిలెట్స్, భద్రత తదితర అంశాలపై ఉన్నతాధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కీలక ఆదేశాలు జారీ చేశారు. దేశంలోనే మహిళా బస్సుల పథకం అతిపెద్ద స్థాయిలో అమలవుతున్న సంగతి తెలిసిందే. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాల్లో భాగంగా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. అందులో భాగంగా వడ్డీ లేని రుణాలు, స్త్రీ నిధి, క్యాంటీన్లు, పెట్రోల్ బంకులతో మహిళలకు చేయూతను అందిస్తోంది. రాష్ట్ర మహిళా సాధికారత నమూనాను అధ్యయనం చేసేందుకు ఇతర రాష్ట్రాలు కూడా ఆసక్తిని కనబరుస్తున్నాయి. ఈ కార్యక్రమానికి వేలాదిగా మహిళలు హాజరు కానున్నారు. అందుకోసం ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఈ పథకాన్ని దేశంలోనే ఇంత పెద్ద ఎత్తున అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని సిఎస్ పేర్కొన్నారు. మహిళల స్వావలంబన కోసం మహిళలకు వడ్డీ లేని రుణాలు, స్త్రీనిధి, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల తయారీ తదితర పథకాల ద్వారా మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేయూత నిస్తున్నదని అన్నారు. మహిళల కోసం తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాల్లో అమలు కోసం ఆయా రాష్ట్రాల అధికారులు అధ్యయనం చేసేందుకు ఇక్కడికి వస్తున్నారని సిఎస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిఎం కార్యదర్శి మాణిక్ రాజ్, డీజీపీ సీవీ ఆనంద్, స్పెషల్ సిఎస్ లు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, దాన కిషోర్, రవాణా కమిషనర్ ఇలంబర్తి, సీఈఓ దివ్య, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి, అశోక్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అలా, ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, తదితర అధికారులు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం జూన్ 09, 2026

# కోరుట్ల నియోజకవర్గ వార్తలు

గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి

జూన్ మొదటి వారంలో కోరుట్ల నియోజకవర్గంలో జరిగిన ముఖ్యమైన వార్తలు టూకీగా ...



**నూతన మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు:** కోరుట్ల మున్సిపల్ కమిషనర్‌గా గ్రూప్-2 అధికారి రాఘవేంద్ర జూన్ 8న అధికారికంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఆయనకు ఇదే మొదటి పోస్టింగ్.

## జాతీయ రహదారి 63 విస్తరణకు కేంద్ర ఆమోదం:

కేంద్ర కేబినెట్ జూన్ 3న తెలంగాణలో రూ. 7,597 కోట్ల విలువైన రహదారి ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆర్మూర్ - కోరుట్ల - జగిత్యాల - మంచిర్యాల (NH-63) సెక్షన్‌ను 4-లేన్ల రహదారిగా విస్తరించనున్నారు.

## లాసెట్ ఫలితాల్లో దేవ్ జీ ప్రతిభ.

జూన్ 4న విడుదలైన తెలంగాణ లాసెట్ (TG LAWCET-2026) ఫలితాల్లో కోరుట్ల పట్టణానికి చెందిన 61 ఏళ్ల మాజీ మావోయిస్ట్ నేత తిప్పిరి తిరుపతి (దేవుజీ) 5 సంవత్సరాల ఎల్.ఎల్.బి కోర్సు ఎంట్రన్స్‌లో 349వ ర్యాంకు సాధించి వార్తల్లో నిలిచారు.

## హైదరాబాద్‌లో బీటెక్ విద్యార్థి అదృశ్యం కేసు.

కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన అంకం రాహుల్ అనే బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థి హైదరాబాద్ కాచిగూడలో గల్లంతయ్యాడు. ఆచూకీ దొరకకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.
హైదరాబాద్‌లో కనిపించకుండా పోయిన రాహుల్.. ప్రకాశం జిల్లా సింగరాయకొండ వద్ద వ్యవసాయ బావిలో శవమై లభ్యమయ్యాడు.

## వాతావరణ హెచ్చరికలు:

జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాల రాక నేపథ్యంలో కోరుట్ల పరిసర ప్రాంతాలతో కూడిన జగిత్యాల జిల్లాకు వాతావరణ శాఖ (IMD) పిడుగులతో కూడిన భారీ వర్షాల హెచ్చరికలు (ఎల్లో అలర్ట్) జారీ చేసింది.

# మేడ్చల్ నియోజకవర్గ వార్తలు

కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి

మేడ్చల్ నియోజకవర్గంలో జూన్ మొదటి వారంలో జరిగిన ముఖ్యమైన వార్తా విశేషాలు టూకీగా




## రూ.1,511 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం:

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో మౌలిక వసతులు, రహదారులు, మూసీ ప్రక్షాళనకు సంబంధించిన రూ.1,511 కోట్ల భారీ అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.

## జంట నగరాల అభివృద్ధి కార్యాచరణ:

హైదరాబాద్‌ను మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా వికేంద్రీకరించి, 122 కి.మీ మేర మెట్రో రైలు విస్తరణ మరియు ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాలను ప్రత్యేక క్యూర్ జోన్‌లుగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

## రెండు రోజుల పాటు వరుస దొంగతనాలు:

జిల్లాలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దుండగులు ఇళ్ల తాళాలు పగులగొట్టి వరుస చోరీలకు పాల్పడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.
ప్రత్యేకంగా మేడ్చల్ నియోజకవర్గ ప్రాంతానికి సంబంధించి జూన్ మొదటి వారంలో ఎలాంటి ప్రత్యేక రాజకీయ పరిణామాలు జరగలేదు.

# కల్లుగీత కార్మికుల పెన్షన్ కోసం ఆన్లైన్ ఓపెన్ చేయండి

-కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్



కరపత్రం ప్రతినిది అందోలు

కల్లుగీత కార్మికులకు 50 సంవత్సరాలు నిండిన కల్లు గీత కార్మికులు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఆన్లైన్ తీసుకోవడం లేదని. వెంటనే ఆన్లైన్ ఓపెన్ చేయాలని కోరుతూ సోమవారం సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ మాధవి కి కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అందరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ. గీత కార్మికులు దరఖాస్తు చేసుకోవడానికి ఆన్లైన్ మాత్రం ఓపెన్ చేయకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులకు పెన్షన్ దరఖాస్తులు తీసుకోవడానికి ప్రభుత్వం ఆదేశాలు కూడా ఇవ్వడం లేదని ఆయన అన్నారు. కనుక దరఖాస్తులు చేసుకోవడానికి గీత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆన్లైన్ ఓపెన్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, కల్లుగీత కార్మికులు మరణించిన వారి భార్యలకు ఆ యొక్క పెన్షన్ భార్య పేరు మీద ట్రాన్ఫర్ చేయడం లేదు. కనుక వారికి వెంటనే వితంతు పెన్షన్లను మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## హనుమకొండ డీఎంహెచ్‌వోగా డాక్టర్ ఎస్. దుర్గారాం కుమార్ బాధ్యతలు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిగా (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఎస్. దుర్గారాం కుమార్ నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను కలిసి నివేదించారు. ఇంతకుముందు కూకట్‌పల్లి జోన్ డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహించిన డాక్టర్ దుర్గారాం కుమార్ బదిలీపై హనుమకొండ జిల్లాకు వచ్చారు. ప్రస్తుతం హనుమకొండ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ అల్లం అప్పయ్యను ములుగు జనరల్ ఆసుపత్రి ఆర్‌ఎంఓగా నియమించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే డిప్యూటీ సివిల్ సర్జన్‌లుగా డాక్టర్ సీహెచ్. మురళి, డాక్టర్ పవిత్ర బదిలీపై జిల్లాకు చేరుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు అభినందనలు తెలిపారు.

# జి.ఎన్.ఎం నర్సింగ్ విద్యార్థికి ఆర్థిక సహాయం

కరపత్రం ప్రతినిధి, గోదావరిఖని జూన్ 08:
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సప్తగిరి కాలనీలో నివాసముంటున్న సిరివేన అక్షయ జి.ఎన్.ఎమ్ నర్సింగ్ విద్యార్థికి, వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థి చదువుతున్న 3 సంవత్సరాల కోర్స్ కు సంబంధించిన ఆర్థిక సహాయం అందించడానికి గోదావరిఖని మేదర్ బస్తీలోని చంద్రశేఖర్ కిరణ మర్చంట్ నిర్వాహకులు సిహెచ్ కిషోర్ తన తండ్రి సిహెచ్ చంద్రశేఖర్ జ్ఞాపకార్థం విద్యార్థి చదువుపించడానికి ముందుకు రావడం జరిగింది. సోమవారం విద్యార్థికి వేయి రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమానికి వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ డా. సురభి శ్రీధర్, సంస్థ సలహాదారులు డా, లయన్ కె.రాజేందర్, సంస్థ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు వేముల రమేష్, సంస్థ బాధ్యులు కొమ్ము రాజు హాజరై అమ్మాయికి ఆర్థిక సాయం అందించారు. అనంతరం సంస్థ సలహాదారులు డాక్టర్ లయన్ కె.రాజేందర్ మాట్లాడారు. వెలుగు సామాజిక స్వచ్ఛ



సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని. దీనిలో భాగంగానే గోదావరిఖని సప్తగిరి ప్రాంతానికి చెందిన విద్యార్థికి జి.ఎన్.ఎమ్ చదువుకోవడానికి మూడు సంవత్సరాలకు అయ్యే ఖర్చును సిహెచ్ కిషోర్ తన తండ్రి జ్ఞాపకార్థం ఆర్థిక సాయం చేయడం అభినందనీయమన్నారు. మొదటగా సోమవారం 1000 రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగిందని తెలిపారు. మూడు సంవత్సరాల పాటు ప్రతినెల 1000 రూపాయలు చొప్పున విద్యార్థి అకౌంట్లోకి వేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం డా. సురభి శ్రీధర్ మాట్లాడారు. అమ్మాయి తల్లిదండ్రులు అమ్మాయి చిన్న వయసులోనే అనారోగ్యంతో చనిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ అమ్మమ్మ వాళ్ళ ఇంట్లో ఉంటుంది. అమ్మమ్మ కూలి పని చేసుకుంటూ చదువుపించడం జరుగుతుందని తెలిపారు. అమ్మాయి తన చదువు కోసం తమ సంస్థను ఆర్థిక సాయం కోరగా, సిహెచ్ కిషోర్ చంద్రశేఖర్ కిరణ మర్చంట్ నిర్వాహకులు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందిస్తామని చెప్పడం జరిగిందని తెలిపారు. విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం చేస్తున్న కిషోర్ కు తమ సంస్థ పక్షాన కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు. విద్యార్థి చదువుకు పూర్తయ్య వరకు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కే.ఏ.జె.టి.ఎస్. రామగుండం సంస్థ నిర్వాహకులు కే.లావణ్య, ఏ.రవితేజ ఎన్.రామకృష్ణ, ఏ.తిరుమల, కే.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ గా ఎల్లంకి వంశీధర్



కరపత్రం ప్రతినిధి, మంథని జూన్ 8
తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గము 2026-2028 సంవత్సరానికి గాను మంథని పట్టణానికి చెందిన 13వ వార్డు కౌన్సిలర్ ఎల్లంకి వంశీధర్ ను ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర రాజకీయ కమిటీ వైస్-చైర్మన్ గా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు సోమవారం నియామక పత్రాన్ని ఎల్లంకి వంశీధర్ కు ఆయన అందజేశారు. ఈ రెండు సంవత్సరాల కాల పరిమితిలో మహాసభ అభివృద్ధికి, సంఘ అభ్యున్నతికి సంపూర్ణ సహాయ, సహకారాలు అందించి, ఆర్యవైశ్య జాతి ఆర్థిక, సామాజిక, రాజకీయ వైభవమునకు, మహాసభ సభ్యత్వమును పెంపొందించుటకు కృషి చేయాలని సూచించారు. తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణకు వంశీధర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకులు కొమురవెల్లి విజయకుమార్, నటరాజ్ లు పాల్గొన్నారు.

# ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి..

కరపత్రం ప్రతినిది గోదావరిఖని జూన్ 08:
తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం మూత్రం వస్తే పోవడానికి బాత్రూమ్స్ లేవని, విద్యార్థులు చెట్ల పక్కకో, గోడ పక్కకో పోయే పరిస్థితి ఉందని, కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, కాబట్టి తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన అన్నారు. అధిక ఫీజులను వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని, విద్యాధికారులను డిమాండ్ చేశారు. విద్యాధికారులు స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తే కార్యాలయాలు ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ప్రత్యేక వార్డు సభలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జూన్ 8
కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ప్రత్యేక వార్డు సభలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలను మరింత చేరువ చేయడం, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించడం లక్ష్యంగా ఈ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య భద్రత పథకాలు తదితర సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులు, వినతులు , సమస్యలను అధికారులు ప్రాధాన్యతగా తీసుకొని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.
నగర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్న మేయర్, ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి



సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటి పరిష్కారానికి నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలు తమ సమస్యలను, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను గత పాలకులు అర్హులైన లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులను గుర్తించి త్వరలోనే ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు.



పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. చెట్ల పెంపకం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, మెరుగైన పర్యావరణాన్ని అందించగలమన్నారు.
అనంతరం టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో మేయర్ కొలగాని శ్రీనివాస్ మొక్కలు నాటారు.
ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి , కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలు, వినతిపత్రాలను సమర్పించారు.

# ఘనంగా మృగశిర కార్తె పండుగ..

-వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టిన రైతులు

కరపత్రం ప్రతినిది సంగారెడ్డి
హిందూ పంచాంగం ప్రకారం, సూర్యుడు మృగశిర నక్షత్రంలో ప్రవేశించే కాలాన్ని మృగశిర కార్తె అంటారు. ప్రతి సంవత్సరం జూన్ మొదటి వారంలో ప్రారంభమయ్యే ఈ కార్తెతో వేసవి తీవ్రత తగ్గి, నైరుతి రుతుపవనాల రాకతో తొలకరి జల్లులు మొదలవుతాయి. ఇది వర్షాకాలం ప్రారంభాన్ని, వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టే సమయాన్ని సూచిస్తుంది. ఈ సమయంలో ఆరోగ్య రక్షణ కోసం చేపలు, బెల్లం, ఇంగువ తినడం పుర్వకాలం నుండి వస్తున్నా సాంప్రదాయం. సోమవారం ఈ సాంప్రదాయ పండుగను సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకోన్నారు.
ఆరోగ్య విశేషాలు - ఆచారాలు:
మిర్గం కార్తె రోజున చేపలు తినడం ఒక ప్రధాన ఆచారం. ఇది వర్షాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలను నివారిస్తుందని, శరీరానికి బలాన్ని ఇస్తుందని నమ్ముతారు. అలాగే బెల్లం, ఇంగువ తినడం కూడా సాంప్రదాయంగా వస్తోంది.
వర్షాకాలారంభం: మృగశిర ప్రవేశంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చి భూమి చల్లబడుతుంది. దీనిని వర్షాలకు, వ్యవసాయ పనులకు నాందిగా రైతన్నలు భావిస్తారు. అందుకే రైతులు నేటి నుండే వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు.

# అన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు చేరితే అభివృద్ధి



**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్ (రామగుండం), జూన్ 8:**
కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది,ఆర్పిలు సమన్వయంతో పని చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని రామగుండం నగర డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 1, 2, 3, 4, 24, 25, 26, 27, 28, 29, 30, 31, 32, 33, 34 డివిజన్ లకు సంబంధించిన క్లస్టర్ లెవెల్ వార్డు సభ ఎన్టిపిసి పిటీఎస్ లోని కాకతీయ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి అర్హులకు అందేలా చూడాలని అన్నారు. నగరాన్ని స్వచ్ఛ రామగుండంగా తీర్చిదిద్దే క్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి ఎంఎల్ఏ, మేయర్ తో సహా వార్డు బాట పట్టడం జరిగిందని అన్నారు. గత రెండు నెలలుగా ఉదయం 6 గంటలనుండి వార్డుల్లో తిరుగుతూ స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నదని అన్నారు. రాబోయే వర్షాకాలంలో ఏ విపత్తు వచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. సెల్ ఫోన్ కారణంగా పిల్లలు చెడిపోతున్నారని, వ్యసనాల బారిన పడి దారి తప్పుతున్నారని అన్నారు. పోలీస్ అధికారుల సూచనలను తల్లి దండ్రులు సీరియస్ గా తీసుకొని తమ పిల్లలు ఏమి చేస్తున్నారో గమనిస్తూ ఉండాలని అన్నారు .అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీ మాట్లాడుతూ.. రుతుపవనాల ప్రభావానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేస్తున్నామని అన్నారు. వరదలు రాకుండా నీళ్లు సాఫీగా ప్రవహించేలా కాలువల్లో పూడిక తొలగించామని అన్నారు. రోడ్లపై గుంతలు పూడ్చడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నీళ్లు ఎక్కడా నిలువ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. శిథిలావస్థకు చేరిన కట్టడాలు తొలగిస్తామని అన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. పైప్ లైన్ లీకేజీ మరమ్మతులు ఎప్పటికప్పుడు పూర్తి చేసి నీళ్లు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు కాచి చల్లార్చి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. దోమలు పెరగకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఘన వ్యర్ధ పదార్థాల నిర్వహణకు సంబంధించి 2016 నిబంధనల ప్రకారం చెత్తను నాలుగు రకాలుగా విభజించాలని కోరారు. తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ చెత్త, ఎలక్ట్రానిక్ వస్తువులను వేర్వేరుగా విభజించి ఇవ్వాలనే అన్నారు. సర్ లో భాగంగా ఓటరు జాబితా మాపింగ్ ప్రక్రియ జూన్ 15 వరకు పూర్తి చేయాలని అన్నారు. వరద ప్రభావం నివారించడానికి అలాగే భూగర్భ జలమట్టం పెరగడానికి నీటి కన్జర్వేషన్ చర్యలు చేపట్టి ఇంకుడు గుంతలు నిర్మించాలని అన్నారు. అన్ని వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించి సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేస్తామని వివరించారు. వన మహోత్సవశీ లో భాగంగా మొక్కలు నాటడానికి అనువైన స్థలాలు అన్వేషించి జాబితా తయారు చేసుకోవడం జరుగుతున్నదని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎసిపి ముడుత రమేష్ అరైవ్ అలైవ్ , ట్రాఫిక్ నిబంధనలు వివరించడంతో పాటు తల్లి దండ్రులు తమ పిల్లల అలవాట్లపై నిఘా ఉంచాలని సూచించారు. రామగుండం ఎంఆర్ఓ రవీందర్ ఓటరు జాబితా సర్ పై అవగాహన కల్పించారు. తమ ఓట్లు పోతాయని అపోహ పడవద్దని అన్నారు. అంటువ్యాధులు అరికట్టడం, జాగ్రత్తలు తీసుకోవడంపై వైద్య ఆరోగ్యశాఖ అధికారి అతుల్య అవగాహన కల్పించారు. అంగన్ వాడీ కార్యకలాపాలపై ఐసిడిఎస్ సిడిపిఓ ఆలేఖ్య పటేల్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, అసిస్టెంట్ కమీషనర్ సంపత్, ఎసిపి శ్రీహరి, పోలీస్, రెవిన్యూ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 5వ వార్డు సభ నిర్వహణ

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 8:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ) కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో కౌన్సిలర్ యాట్ల సునీత అశోక్ అధ్యక్షతన వార్డు సభ నిర్వహించారు.





ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా స్వచ్ఛ సర్వేక్షన్, పరిసరాల పరిశుభ్రత, డ్రైనేజీల శుభ్రపరిచే కార్యక్రమాలు, వీధి దీపాల ఏర్పాటు, రుతుపవనాల సన్నద్ధత, జల్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా, నీటి నిర్వహణ, పచ్చదనం పెంపు కోసం మొక్కల నాటకం, ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, కొత్త పింఛన్ల మంజూరు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

అదేవిధంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, ప్లాస్టిక్ నిర్మూలన అవసరం, పర్యావరణ పరిరక్షణలో ప్రజల బాధ్యతలపై అవగాహన కల్పించారు. తాగునీటిని వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

వార్డు సభలో ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని, వాటిని ప్రాధాన్యత ఆధారంగా గుర్తించి ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేశారు. సమస్యల పరిష్కారానికి మున్సిపల్ యంత్రాంగం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ పోచం, సీనియర్ అసిస్టెంట్ రమేష్, ఆర్పి విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ కవిత, వీవోఏ మమత, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డు సభలు నిర్వహణ

- 7, 22, 27, 30 వార్డుల సభల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 8**
జమ్మికుంట పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కింద స్థానిక పత్తిదారుల సంఘ భవనంలో 7, 22, 27, 30 వార్డులకు సంబంధించిన వార్డు సభలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఇళ్లను శుభ్రంగా ఉంచినట్లే పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇంటి నుంచి వెలువడే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ చెత్త వాహనాలకు అందించాలని కోరారు. వర్షాకాలం నేపథ్యంలో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, ఇతర వ్యర్థాలను డ్రైనేజీల్లో వేయరాదని, వాటివల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలిగి ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు.

అలాగే ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. "అమ్మ మనకు జన్మనిస్తే, మొక్కలు పునర్జన్మనిస్తాయి" అని పేర్కొంటూ పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం



అవసరమని చెప్పారు.

సభలో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు--2026, "జల్ సంచయ్--జల్ భాగీధారి" కార్యక్రమం కింద వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాల ఏర్పాటు, డ్రైన్ల పూడికతీత, వర్షాకాల సన్నద్ధత చర్యలు, తాగునీటి సరఫరా, నీటి నిల్వల నివారణ, పారిశుధ్య నిర్వహణ, రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ఐసీడీఎస్ సూపర్వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నారుల పోషణకు సంబంధించిన అంశాలను కూడా వివరించారు.

విద్యుత్ శాఖ ఏఈ మాట్లాడుతూ విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రతి వార్డుకు లైన్‌మెన్,



జేఎల్ఎంలు అందుబాటులో ఉంటారని, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

ఆరోగ్య శాఖ అధికారులు మాట్లాడుతూ ఎండాకాలంలో వడదెబ్బ నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే తరచూ నీరు తాగాలని సూచించారు. వడదెబ్బ కారణంగా ఎవరైనా మరణించిన సందర్భంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించడం అవసరమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, కౌన్సిలర్లు శీలం శ్రీనివాస్, చందా రాజు, ఫిరోజ్, మంద రాధా, మంద రాజేష్, ఏఈ వికాస్, వార్డు అధికారులు, సిఎల్ఆర్‌పీలు, ఆర్‌పీలు, విద్యుత్ శాఖ అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఏఎల్ఎంలు, జేఎల్ఎంలు, వార్డుల పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# యునైటెడ్ కరీంనగర్ జిల్లా అండర్-13 చెస్ ఛాంపియన్‌షిప్‌లో విశ్వనాథ్ చెస్ అకాడమీ విద్యార్థుల సత్తా

- ఛాంపియన్‌గా ఈగ లిఖిత్ చైతన్య, రన్నరప్‌గా అమన్‌రామ్ బాలసంకుల

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జూన్ 8**



కరీంనగర్‌లో జరిగిన యునైటెడ్ కరీంనగర్ జిల్లా అండర్-13 బాయ్స్ , గర్ల్స్ చెస్ ఛాంపియన్‌షిప్-2026 పోటీలలో విశ్వనాథ్ చెస్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో సత్తా చాటారు.

ఐదు జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో విశ్వనాథ్ చెస్ అకాడమీ విద్యార్థి ఈగ లిఖిత్ చైతన్య ఛాంపియన్‌గా,అమన్‌రామ్ బాలసంకుల రన్నరప్‌గా నిలిచి అకాడమీకి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారు.విజేతలుగా నిలిచిన చిన్నారులకు నిర్వాహకులు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ చెస్ అకాడమీ కోచ్‌లు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన శిక్షణ, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. జిల్లా స్థాయిలో తమ విద్యార్థులు ఛాంపియన్, రన్నరప్‌గా నిలవడం గర్వకారణమని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఛాంపియన్ ఈగ లిఖిత్ చైతన్య, రన్నరప్ అమన్‌రామ్ బాలసంకులను, వారికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లను, సహకరించిన తల్లిదండ్రులను, సపోర్ట్ స్టాఫ్‌ను పలువురు అభినందించారు.విశ్వనాథ్ చెస్ అకాడమీ కరీంనగర్‌లోని జ్యోతినగర్, భగత్‌నగర్ బ్రాంచ్‌లలో చిన్నారులకు చెస్‌లో నాణ్యమైన శిక్షణ అందిస్తోందనీ,అడ్మిషన్లు ప్రారంభమయ్యాయనీ మరిన్ని వివరాలకు 7569229294 సంప్రదించగలరని తెలిపారు.

# పెరిగిన ఎల్పీజీ ధరలపై కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన

- ఇందిరా చౌక్‌లో వంటావార్పుతో కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్, జూన్ 8:**
కేంద్రంలోని ఎన్‌డీఏ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఇటీవల ఎల్పీజీ గ్యాస్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఇందిరా చౌక్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నాయకత్వం వహించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెరిగిన గ్యాస్ ధరలు సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం రోడ్డుపై వంటావార్పు నిర్వహిస్తూ తమ నిరసనను వినూత్నంగా వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో వంటగ్యాస్ ధరలను కూడా పెంచడం అన్యాయమని విమర్శించారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు వంటగ్యాస్‌పై ఆధారపడుతున్న నేపథ్యంలో ధరల పెంపు వారి కుటుంబ బడ్జెట్‌ను పూర్తిగా దెబ్బతీస్తోందన్నారు.



నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడం ప్రజలపై భారాలు మోపే రాజకీయ ధోరణికి నిదర్శనమని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజల సంక్షేమం గురించి మాట్లాడే బీజేపీ ప్రభుత్వం, ఎన్నికలు పూర్తయ్యాక ప్రజలపై ధరల భారం మోపడం దురదృష్టకరమన్నారు.

దేశవ్యాప్తంగా పెరుగుతున్న ధరలతో ప్రజలు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడంతో గృహిణులపై మరింత భారం పడిందన్నారు. వెంటనే పెంచిన ఎల్పీజీ ధరలను వెనక్కి తీసుకోవాలని, లేకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధానాలు అవలంబిస్తోందని, సామాన్య ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. పేదల సంక్షేమాన్ని విస్మరించి ధరల పెంపులతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఉపసంహరించుకోకపోతే రానున్న రోజుల్లో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత



తప్పదని స్పష్టం చేశారు.కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్, జిల్లా కార్యదర్శులు వావినిల సత్యనారాయణ, కంకణాల జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గూడెపు సారంగపాణి, మోలుగూరి సదయ్య, సుంకరి రమేష్, సతీష్ రెడ్డి, ముద్దామళ్ల రవి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు హాజరై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

"మోడీ హటావో -- దేశ్ బచావో", "గ్యాస్ ధరలు తగ్గించాలి", "ప్రజలపై భారాలు మోపొద్దు" అంటూ నిరసనకారులు నినాదాలతో ఇందిరా చౌక్ ప్రాంతాన్ని మార్మోగించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందని నాయకులు తెలిపారు.

# స్టేట్ కరాటే టోర్నమెంట్ లో జెఎస్కెఎస్ విద్యార్థుల హవా




**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 08:**
జగిత్యాలలో ఎల్ ఎల్ గార్డెన్ లో వినకోసియా షోటాఖాన్ కరాటే స్టేట్ చాంపియన్షిప్ 2026 నిర్వహించారు. టోర్నమెంట్ లో వివిధ జిల్లాల నుండి సుమారుగా 421 విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనగా పెద్దపల్లి జిల్లా రామగుండంకు చెందిన జపాన్ షిటోరియో కరాటే స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు కటాస్, కుమితి విభాగాలలో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. బ్లాక్ బెల్ట్ కటాస్ విభాగంలో సంయుక్త బంగారు పతకం, ఎం.కార్తికేయన్ బంగారు పతకం, ఆశ్రిత వెండి బంగారు పతకం, కె.కార్తిక వెండి పతకం, బ్లాక్ బెల్ట్ కుమితి విభాగంలో ఎస్.సంయుక్త బంగారు పతకం, ఆశ్రిత వెండి పతకం, కె.కార్తిక వెండి పతకం, ఎం.కార్తికేయన్ వెండి పతకం, కలర్ బెల్ట్ కటాస్ విభాగంలో నిహాల్ నందన్ బంగారు పతకం, వి.భువనేష్ బంగారు పతకం, వి.చిరస్వి వెండి పతకం, కలర్ బెల్ట్ కుమితి విభాగంలో వి.భువనేష్ వెండి పతకం పతకం, నిహాల్ నందన్ కాంస్య పతకం సాధించారు. ఫీనకోషియా షోతో కాన్ కరాటే టోర్నమెంట్ లో పతకాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను, కోచ్ కరాటే శ్రీనివాస్ ను జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ప్రెసిడెంట్ ఎం.రమేష్, సీనియర్ ఇన్స్ట్రక్టర్స్ ఎస్.శ్రీనివాస్, శ్రావణ్ కుమార్ పటేల్, బి.పరమేష్, నిదిష్ కుమార్, రోహిత్ కుమార్, సంజన, శుభశ్రీ, హేమలత మహా జీ ,అభిజ్ఞ, స్పందన క్లబ్ సెక్రటరీ డాక్టర్ కె.నరేంద్ర సోనీ, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ శ్రీరామ్, చిరంజీవి ఆదిత్య, వంశీకృష్ణ, గణేష్ రాజ్, తల్లిదండ్రులు అభినందించారు.